నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

శుక్రవారం 31 మార్చి 2023

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



నవతెలంగాణ-గాంధారి

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గాంధారి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ డి.సుధాకర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు పయ్యావుల స్వామి(44) మరో రైతు వ్యవసాయ భూమిలో వ్యవసాయ మోటారు దించుటకు సహాయంగా వెళ్లాడు. మోటారు దించడం ముగిసిన తర్వాత మోటారు పైపును పక్కకు తిప్పుతుండగా ప్రమాదవశాత్తు మోటారు పంపుకు కరెంట్ సప్లయ్‌కాగా.. విద్యుత్‌షాక్‌తో రైతు స్వామి మరణించాడు. మృతుని కుమారుడు పయ్యావుల సతీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కందకుర్తిలో కుస్తీ పోటీలు



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలో నాందేడ్‌కు చెందిన మల్లయోధుడు రాజు గెలుపొందాడు. ఆయనకు 15 తులాల వెండి కడియం బహుకరించారు. మహారాష్ట్ర నుంచి మల్లయోధులు రావడంతో రూ.500 నుంచి 1000, 1500, 2000, 3000, 5000 వరకు కుస్తీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీర్జా కలీం బేగ్, ఉప సర్పంచ్ యోగేష్, నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, ఎంపీటీసీ అసాధ్ బేగ్, గౌస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో బలమెవరిది?

నాయకుడి వేటలో ప్రధాన పార్టీలు

- కార్యకర్తలకూ అందని అనిల్
- ముత్యాల సునీల్ ఏ పార్టీలో చేరతారన్నది ఆసక్తి
- బీజేపీలో చేరికపై వివాదం

రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొంది. ఆత్మీయ సమ్మేళనాలు, పార్టీలో చేరికలు, విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రధాన పార్టీలు పోటాపోటీ పడుతున్నాయి. కానీ నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గంలో పరిస్థితి కొంత విచిత్రంగా, కొత్తగానూ ఉంది. బీఆర్ఎస్ నుంచి మంత్రి వేమల ప్రశాంత్‌రెడ్డి ఉండగా.. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నాయకుడి వేటలో ఉన్నాయి. గతంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఈరవత్రి అనిల్.. ఎన్నికల నాటి నుంచి ఇప్పటికీ కొన్ని మండలాల్లో కనీసం అడుగుపెట్టని పరిస్థితి ఉంది. ఇక బీజేపీ నుంచి అభ్యర్థి ఎవరన్నది ఆ పార్టీలో పెద్ద దుమారమే రేపుతోంది. ఆ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం ముత్యాల సునీల్‌కుమార్ కేంద్ర బిందువుగా ఉన్నారు. ఆయన బీజేపీలో చేరతారని ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఈ విషయంలో బీజేపీ ఎంపీ అరవింద్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మధ్య తీవ్రమైన గలాట సాగుతోంది. దీంతో ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు నాయకుడి వేటలో ఉన్నాయి.



మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



ముత్యాల సునీల్‌కుమార్



ఈరవత్రి అనిల్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

బాల్కొండ నియోజకవర్గంలో అధికార పార్టీ మినహా ప్రతిపక్షాలన్నీ నాయకుడి వేటలోనే కొనసాగుతున్నాయి. అధికార పార్టీ నేత, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చురుకుగా నియోజకవర్గంలో విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు మళ్లీ గెలిపిస్తాయని నమ్మకంగా ఉన్నారు. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు తదితర స్కీములతో లబ్ధిదారులు మళ్లీ పట్టం కడతారని భావిస్తున్నారు. అయితే రెండు పర్యాయాలు ఈ ప్రాంతం నుంచి గెలిచిన నేపథ్యంలో.. ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని విపక్షాలు నమ్ముతున్నాయి. కానీ ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నుంచి కేడర్ ఉన్నప్పటికీ.. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన నేత కరువయ్యారు. కాంగ్రెస్ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన ఈరవత్రి అనిల్.. గత ఎన్నికల నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా రాష్ట్ర రాజధానికే పరిమితమవుతున్నాడని, కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకోవడం లేదని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో అటు పార్టీ శ్రేణులు కూడా నిరుత్సాహంగా ఉన్నాయి.

ముత్యాల దారెటు...

గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ముత్యాల సునీల్‌కుమార్ రెండోస్థానంలో నిలిచారు. బీఎస్పీకి రాజీనామా చేసిన తరువాత ఏ పార్టీలో చేరడంపై ఇప్పటికీ తేల్చుకోవడం లేదు. బీజేపీలో చేరుతారని ఆ మధ్య ప్రచారం జరిగినప్పటికీ.. ఆయన రాకను జిల్లాలోని నేతలు అడ్డుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ విషయంలో బీజేపీ ఎంపీ అరవింద్‌కు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. మల్లిఖార్జున రెడ్డికి ముందుగానే మాట ఇచ్చిన నేపథ్యంలో.. ముత్యాల సునీల్‌కు సీటు ఇచ్చే విషయంలో హామీ ఇవ్వరాదన్నది ఎంపీ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. అయితే స్పష్టమైన హామీ లభిస్తేనే బీజేపీలో చేరాలని ముత్యాల సునీల్‌కుమార్ ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి సీటు కోసం చివరి వరకు ప్రయత్నం చేసినప్పటికీ.. సీటు రాకపోవడంతో చివరకు బీఎస్పీ నుంచి ఆయన పోటీ చేశారు. ఈ సారి కాంగ్రెస్ నుంచి అవకాశం ఉన్నప్పటికీ వేచి చూసే ధోరణిలో ఉన్నాడు. అయితే బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇంఛార్జీగా ఉన్న మల్లికార్జున్ రెడ్డికి పార్టీ కార్యకర్తల నుంచి అంతగా సహకారం లభించడం లేదని టాక్.

ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్..

గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ఏ ఒక్క కార్యక్రమమూ చేపట్టని పరిస్థితి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి ప్రశ్నించిన నాథుడు లేడు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జిగా ఉన్న అనిల్.. నియోజకవర్గంలోని మండలాలలో కూడా గత నాలుగు సంవత్సరాల నుంచి కాలుపెట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ, పోరాటం చేస్తూ అనునిత్యం ప్రజలకు, పార్టీ నేతలకు అందుబాటులో ఉండాల్సిన కాంగ్రెస్ నాయకులు అందుకు దూరంగా ఉంటున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మనుగడ లేకుండా పోతుందని కార్యకర్తల్లో భయం నెలకొంది.



ఇసుక రాజ్యం

నిబంధనలకు విరుద్ధంగా 'పుల్కల్ క్వారీ' నిర్వహణ

- వేబిల్లులు లేకుండానే ఇసుక అక్రమ రవాణా
- నిత్యం 200 నుంచి 250 లారీల ద్వారా ఇసుక తరలింపు
- దీని ద్వారా ప్రతి రోజు లక్షల్లో ఆదాయం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



10 మీటర్ల లోతువరకు జేసీబీ ద్వారా తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

నవతెలంగాణ-బిచ్కుంద

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో ఇసుక రాజ్యం చాప కింద నీరులా జడలు విప్పుతోంది. అధికారుల కుమ్మక్కు.. క్వారీ నిర్వహకుల ఇష్టారాజ్యం.. వెరసి ఇసుక దందా 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా.. సాగుతోంది. తద్వారా అక్రమార్కులు నిత్యం లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

మండలంలోని పుల్కల్ గ్రామ శివారులో మంజీరా పరివాహక ప్రాంతం నుంచి నిబంధనలకు విరుద్ధంగా మంజీరా నది నడిబొడ్డున ఐదు నుంచి పది మీటర్ల లోతు యంత్రాలతో ఇసుకను తవ్వుతూ యథేచ్ఛగా వేబిల్లులు లేకుండానే రాత్రి పగలు అనే తేడా లేకుండా రవాణా చేస్తున్నారు. గురువారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా సెలవు ఉన్నప్పటికీ అధికారుల అండదండలతో యథేచ్ఛగా వే బిల్లులు లేకుండానే ఇసుక రవాణాకు తెర లేపారు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలి. కానీ టీఎస్ఎండీసీ, రెవెన్యూ శాఖ అధికారుల పుణ్యమా అని కాంట్రాక్టర్లు యథేచ్ఛగా తమ జీరో దందా నడుపుతున్నారు. ఈ విషయంపై ఎవరైనా ప్రశ్నిస్తే తమకు రాష్ట్రస్థాయి నాయకులు అండదండలు ఉన్నాయని ఎవరైనా అడ్డుకుంటే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రతిరోజు లక్షల విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండి కొడుతున్నారు. టీఎస్ఎండీసీ, రెవెన్యూ మైనింగ్, పోలీస్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇసుక కాంట్రాక్టర్లు, ఈ వ్యవహారం జోరుగా సాగిస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ రోజు లక్షల్లో ఆదాయం..

క్వారీ నిర్వహకులు ఇష్టారాజ్యంగా ఇష్టాను సారం తవ్వకాలు జరుపుతూ ఒక్కో వాహనానికి వేలల్లో రూపాయలు తీసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ రోజు లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఈ తతంగమం ఇలా జరుగుతుండగా ఇక్కడ పర్యవేక్షించాల్సిన టీఎస్ఎండీసీ అధికారులు నామమాత్రపు విధులు నిర్వహిస్తుండడంతో కాంట్రాక్టర్లకు అడ్డు అదుపు లేకుండా పోయింది. దీనికి తోడు రెవెన్యూ శాఖ అధికారులు ఇటువైపు చూడపోవడం గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు తాము ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. తద్వారా అక్రమ ఇసుక రవాణా చేస్తూ లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

ప్రాణాలు తీస్తున్న ఇసుక గుంతలు..

మంజీరా నదిలో ఇసుక తరలించడానికి నిబంధనలకు విరుద్ధంగా పది మీటర్ల ఆపై లోతులో తవ్వకాలు జరపడంతో ఇసుక గుంతలు ప్రమాదకరంగా మారి అమాయక ప్రజల, పశువుల ప్రాణాలు తీస్తున్నాయి. వాగు దాటుతూ తవ్విన గుంతల లోతు తెలియక ప్రజలు పశువులు నీట మునిగి చనిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. పుల్కల్ మంజీరా పరివాహక ప్రాంతం నది నడిబొడ్డున తవ్వకాలు చేపడుతుండడంపై గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నదిలో ఇసుక తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నో చెక్‌పోస్ట్, నోచెకింగ్..

మంజీరాలో ఇసుక తవ్వకాలకు టీఎస్ఎండీసీ ద్వారా అనుమతులు ఇచ్చినప్పటికీ సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేదు. ఇసుక రీచ్‌ల వద్ద వేవింగ్ మిషన్, సీసీ కెమెరాలు, ఇసుకను తరలించే లారీలకు టిప్పర్లకు జీపీఎస్ ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ టీఎస్ఎండీసీ అధికారులు వీటిలో వేటినీ ఏర్పాటు చేయకుండానే ఇసుక రవాణా జరుగుతుంది. ఇసుక రీచ్‌లో నుంచి లోడుతో వెళ్లే టిప్పర్లను లారీలను నిత్యం తనిఖీ చేసేందుకు స్థానికంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇసుక కాంట్రాక్టర్లు అధికారుల కుమ్మక్కుతో ఎక్కడ చెక్‌పోస్ట్ లేకపోవడంతో వే బిల్లులు లేకుండానే టిప్పర్లు, లారీల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన ఇసుకను స్థానికంగా కాకుండా కర్ణాటక, మహారాష్ట్రతో హైదరాబాద్ లాంటి మహా నగరాలకు తరలిస్తూ కాంట్రాక్టర్లు, ప్రైవేట్ వ్యక్తులు రోజు లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఈ విషయంపై బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్‌ను ఫోన్‌లో సంప్రదించగా పూర్తి వివరాలు కనుక్కుని చెబుతానని తెలిపారు. అనంతరం మళ్లీ ఫోన్ చేయగా ఫోన్ లేపకపోవడం గమనార్హం.



వందల లారీల్లో ఇసుకను తలలిస్తున్నారు ఇలా..

ఘనంగా రాములోరి కల్యాణం

- పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ప్రభుత్వ విప్

శ్రీ రామ నవమి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్ రోడ్‌లో గల రాంమందిర్ ఆలయంలో రాములోరి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సందర్శించి సీత రాముల కళ్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, ఓడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, లోయలపల్లి నర్సింగరావు, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, పిప్పిరి వెంకటి, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, గైని శ్రీనివాస్‌గౌడ్, పిట్ల వేణు గోపాల్, గెరిగంటి లక్ష్మీనారాయణ, కుంబాల రవి యాదవ్ పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీమంత్రి..

కామారెడ్డి రైల్వేస్టేషన్‌లోని శ్రీరాముని కళ్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని భిక్నూర్ గ్రామంలో పెద్దమ్మ జాతరలో భాగంగా బోనాల ప్రదర్శన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా అలంకరించిన బోనాలను ఎత్తుకొని భాజాభజంత్రీల చప్పుళ్ల మధ్య గ్రామ పొలిమేరలో గల పెద్దమ్మ ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా యువకులు, చిన్నారులు డప్పుచప్పులకు, డీజే పాటలకు అణువుగా నృత్యాలు చేశారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. పెద్దమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా ట్రాక్టర్, ఎడ్లబండ్ల ప్రదర్శన, కుస్తీ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో మహిళలు

తెలంగాణలో

శివాలయాలుగా ఉన్న ప్రాజెక్టులు వైష్ణవాలయాలుగా..

- రామరాజ్యంలా కేసీఆర్ పాలన
- యావత్ భారతావనికి శ్రీరామ రక్ష
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేసీఆర్ పాలనలో తెలంగాణలో శివాలయాలుగా ఉన్న ప్రాజెక్టులు.. వైష్ణవాలయాలుగా మారాయని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్ - సోన్‌పేట్ గ్రామాల మధ్య కాకతీయ కెనాల్‌పై రూ.1.30 కోట్లతో నిర్మించే నూతన బ్రిడ్జ్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. తెలంగాణలో రామరాజ్యంలా కేసీఆర్ పాలన సాగుతోందని వివరించారు. కేసీఆర్ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో రైతులు, కుల వత్తులు ఇలా అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. పేదలు, రైతులు అంటే పరితపించే కేసిఆర్ నాయకత్వం యావత్ భారతావనికి శ్రీరామరక్ష లాంటిదన్నారు.

గురువారం శ్రీరామనవమి పురస్కరించుకొని పోచంపాడ్ కోదండ రామాలయంలో రాములవారి కల్యాణోత్సవంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సీతారామ కళ్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పోచంపాడ్-సోన్‌పేట్ గ్రామాల మధ్య కాకతీయ కెనాల్‌పై నూతన వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం కృషి వల్ల ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా కాకతీయ కాలువ 365 రోజులు నిండుగా ఉంటుందని, అందుకే బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం అయ్యిందని అన్నారు. మొదట కోటి రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తే ఏడాది పొడవునా నీరు ఉంటుండంతో కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదని, ఆర్అండ్‌బీ శాఖ కొత్త టెక్నాలజీతో బ్రిడ్జి నిర్మిస్తుందని వివరించారు. అందుకు రూ.25 నుంచి రూ.30 లక్షల కోట్లు అదనంగా ఖర్చు అవుతున్నాయని వెల్లడించారు. కొద్ది రోజుల్లోనే బ్రిడ్జి అందుబాటులోకి రానుందని మంత్రి అన్నారు.

నాడు శివాలయాలుగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులు నేడు వైష్ణవ ఆలయాలుగా...

పోచంపాడ్ శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్‌పై రూ.25 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. లిఫ్ట్ వలన అధికారులకు ప్రాజెక్టు కింది భాగాన ఉన్న వరద గేట్లను పరిశీలించడానికి, ఇతర పనులకు అనువుగా మారనుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు శివాలయాలుగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో వైష్ణవాలయలుగా మారాయి అన్నారు. పోచంపాడ్ ప్రాజెక్ట్‌పై రోడ్లు, రిటైనింగ్ వాల్, వరద గేట్ల మరమ్మతులు, ఇతర పనుల కోసం ఇప్పటి వరకు సుమారు రూ.40 కోట్ల వరకు ఖర్చు చేశామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ గుంతను తవ్వారు.. వదిలేశారు..

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పనుల్లో అధికారుల నిర్లక్ష్యంతో అభాసు పాలవుతోంది. నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని ఉర్దూ స్కూల్ వద్ద తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల కోసం మిషన్ భగీరథ అధికారులు గుంత తవ్వి వదిలేశారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మైలారం, నసురుల్లాబాద్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలారం నసురుల్లాబాద్, బీర్కూర్ వెళ్లే ప్రయాణికులు వెళ్లే రహదారి పక్కనే పెద్ద గుంత తవ్వడంతో రాత్రి వేళల్లో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు నుంచి బీర్కూర్‌చ బిచ్కుంద, మద్నూర్ వెళ్లే ప్రయాణికులతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. పెద్ద గుంత తవ్వడంతో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయని ప్రజలు చెబుతున్నారు. నెలలు గడుస్తున్నా మరమ్మతు కోసం తవ్విన గుంత పూడ్చడం లేదు. అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల అలసత్వంతో ఇలాంటి గుంతను పూడ్చటం లేదని ప్రజలు అంటున్నారు. మిషన్ భగీరథ మండల, డివిజన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, చూసీచూడనట్టు వ్యవహరించడంతో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన గుంతను వెంటనే పూడ్చాలని రెండు గ్రామాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన గుంత

మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులు రిపోర్ట్ చేయాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ఇంటర్మీడియట్ జవాబు పత్రాలు ఈనెల 31 నుంచి మొదటి స్పెల్ ప్రారంభమవుతున్న మూల్యాంకనానికి విధుల ఆర్డర్ కాపీలు వచ్చిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రతి అధ్యాపకుడు వెంటనే రిపోర్టు చేయాలని జిల్లా ఇంటర్ విద్యార్థి అధికారి రఘురాజ్ ఆదేశించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితశాస్త్రం, పౌరశాస్త్రంకు సంబంధించిన మూల్యాంకనం శుక్రవారం ప్రారంభమవుతుందని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. మూల్యాంకన విధులు ఆర్డర్ వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్, మోడల్ స్కూల్, మైనారిటీ, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తూ ఇంటర్ బోర్డు ఆర్డర్లు వచ్చిన అధ్యాపకులందరూ రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనల ప్రకారం మూల్యాంకన విధులకు హాజరుకాని అధ్యాపకులపై చర్యలు తీసుకోవడానికి ఇంటర్ బోర్డు సిద్ధంగా ఉందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తెలిపారు. గతంలో హాజరుకాని అధ్యాపకులకు అపరాధ రుసుము చెల్లించడంతోపాటు శాఖపరమైన చర్యలను కూడా తీసుకున్నట్టు వివరించారు.

సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

- బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి

నవతెలంగాణ-పిట్లం

సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని బాన్సువాడ డివిజనల్ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడంతో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పెట్రోలింగ్ ముమ్మరం చేసి దొంగతనాలను అరికట్టాలని, వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, రోడ్డు సేఫ్టీ వీధి విధానాలను వాహనదారులకు సూచించాలని అన్నారు. దొంగతనాలను, సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు గ్రామ, మండల కేంద్రాల ప్రధాన వీధులలో, కిరాణా వ్యాపార సముదాయాలలో సీసీ కెమెరాలు అమర్చుకునేందుకు అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లింబాద్రి, సిబ్బంది శైలేష్, బుచ్చయ్య, కాషాగౌడ్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అన్నారం గ్రామానికి చెందిన పొక్కిలి ఈశ్వరవ్వ- రాజయ్య వృద్ధులకు పిల్లలు లేకపోవడంతో, ఈశ్వరవ్వ చెల్లె బిడ్డ, అల్లుడ్ని ఎల్లారెడ్డిపేట నుంచి వారసునిగా గత 15 రోజుల క్రితం తీసుకొచ్చారు. గురువారం అల్లుడు బాలకృష్ణ (30), గేదెకు గడ్డి కోస్తూ అనుమానాస్పద స్థితిలో పొలం ఒడ్డు కింద పడి మృతి మృతి చెందాడు. మృతుడికి ఒక కొడుకు ఉన్నాడు.

ఏకలవ్యలో ప్రవేశానికి ధరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గిరిజన సంక్షేమ శాఖ ఇందల్వాయి ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో 6వ తరగతిలో 60 సీట్లు, 7 నుండి 9 తరగతుల వరకు మిగిలిపోయిన సీట్ల భర్తీ కొరకు ఈ ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. https://fastses.telangana.gov.in ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఏప్రిల్ 20 వరకు ఉందని తెలిపారు. ధరఖాస్తుల స్వీకరణ అనంతరం మే 7న అరర్హత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆయా తరగతుల్లో సాధించిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఏకలవ్య పాఠశాలలో మొత్తం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని, విద్యార్థులు వారి తల్లిదం డ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

గంగాజలంతో ఊరేగింపు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్



మండలంలోని పడగల్ గ్రామంలో గురువారం శ్రీరామనవమి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఉదయం అన్ని కుల సంఘాల నుండి గంగా జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఎదుర్కోల్లు నిర్వహించి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా స్థానిక రామాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల సునీల్ రెడ్డి ,ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- సీతారాములు కల్యాణంలో పాల్గొన్న ప్రముఖులు
- పట్టు వస్త్రాలు సమర్పించిన పలువురు
- ఇందూరు తిరుమల ఉత్సవాల్లో పాల్గొన్న నిర్మాణ దిల్‌రాజు, బలగం సినిమా దర్శకుడు వేణు ఎల్దండి



ఆర్మూర్: పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దంపతులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్: అంగరంగ వైభవంగా జరిగిన శ్రీరామనవమి వేడుకలతో గురువారం నవనాథుల సిద్దులగుట్టపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీసీతారామ కల్యాణ మహోత్సాహంతో సిద్ధులగుట్ట శోభాయమానంగా విరాజిల్లింది. "రమణీయం, కమనీయం, రాములోరి కల్యాణం" అని మురిసిపోతూ భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య కమనీయంగా నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవానికి భక్తజనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సిద్ధులగుట్ట రామాలయంలో సీతారాముల కళ్యాణానికి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, ఆయన సతీమణి రజితా రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పంపించిన పట్టు వస్త్రాలను కూడా జీవన్ రెడ్డి ఆలయ పూజారులకు అందజేశారు.ప్రతి సంవత్సరం శ్రీ సీతారా ముల స్వామి వారికి కవిత పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కాగా జీవన్ రెడ్డి దంపతులు రాములోరి కళ్యాణం అనంతరం శివాలయంలో పూజలు నిర్వహించి అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్ కాలనీలో గల రామమందిరం లో శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో కూడా జీవన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేశ్వర్ రెడ్డి బి ఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్ శ్రీ రమ సత్యనారాయణ స్వామి, మామిడిపల్లి హనుమాన్ ఆలయంలోనూ, గోవింద్ పెట్ రామాలయంలోనూ జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోపాల్:నర్సింగ్ పల్లి ఇందూరు తిరుమల క్షేత్రంలో శ్రీరాముని కళ్యాణంలో ఆలయ ధర్మకర్త నర్సింహ రెడ్డి దంపతులు, దిల్ రాజు దంపతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు గాయకులు స్వామివారి కీర్తనలను అద్భుతంగ పాడి రక్తి కట్టించారు. కార్యక్రమంలో విజయసింహారెడ్డి, సర్పంచ్ సాయరెడ్డి, ఎంపీటీసీ రాములు, ఫోటో గంగాధర్, రవీందర్ యాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రమేష్, భాస్కర్, లక్ష్మి రాజేశ్వర్, మురళి, అరుణ్, అరవింద్, భూం రెడ్డి, చిన్నయ్య, ఎర్రోళ్ల సాయిలు. వేద పండితులు సంపత్ కుమార్ స్వామి, రోహిత్ స్వామి, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:మండలంలోని రెంజర్ల గ్రామంలో గ్రామస్తుల మధ్య శ్రీరాముని కళ్యాణ మహోత్సవంను గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. శ్రీ కోదండ రామాలయంలో స్వామివారి 49వ వార్షిక బ్రహ్మోత్సవాలు చేపట్టారు. కళ్యాణం అనంతరం సాయం త్రం రథోత్సవం నిర్వహించారు. శుక్రవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు..

కమ్మర్‌పల్లి:మండలంలోని నాగపూర్‌లో రామాలయం 62వ వార్షికోత్సవ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం జరిపారు. పాలేపు రవికిరణ్ దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు దుబ్బాక సుప్రియ శ్రీకాంత్ స్వామివారికి బంగారం పుస్తె, మట్టెలు, ముత్యాల తాళంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం ఘనంగా జరిగింది. నాగపూర్ గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కమ్మర్ పల్లి లో హనుమాన్ మాల ధారణ స్వాములు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. స్వాములతో పాటు యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

నవీపేట్: మండల కేంద్రంలో హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో రాముల వారి ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయం నుండి ప్రధాన చౌరస్తా గుండా తడగం, సుభాష్ నగర్, దర్యాపూర్ లలో శోభాయాత్ర నిర్వహించారు. ఊరేగింపులో హనుమాన్ స్వాములు నవీన్ రాజ్ సతీష్, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఖిల్లా రామాలయంలో కల్యాణం సందర్భంగా ఆర్టిసి చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీరాముడు చూపిన బాటలో నడవాలని బాజిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి , ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి , సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, మాజీ మండల అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, సర్పంచ్ రాధ కృష్ణరెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలోగల అతి పురాతనమైన రామాలయంలో స్వామివారికి కళ్యాణం నిర్వహించారు. ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధర్పల్లి జడ్పీటిసి బాజిరెడ్డి జగన్ మోహన్, ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని సుఖసంతోషాలతో అష్ట అయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలువేరి గంగా దాసు, లావణ్య, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, ఎంపిటిసి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారంపల్లి సుధాకర్ , బిఆర్ఎస్ సినియర్ నాయకులు, పాశం పెద్ద నర్సింలు, పాశం కుమార్, భక్తులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:నిజామాబాద్‌లోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద రామ్ మందిర్ లోని డోలారోహణ కార్యక్రమంలో పాల్గొని సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఇందూరు ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఖిల్లా రామాలయం, బోర్గంలోని రామాలయం, సుభాష్ నగర్ రామాలయం బైపాస్ రోడ్ లోని రామాలయాలను దర్శించుకున్నారు. పెద్ద రామ్ మందిరాలయ కమిటీ సభ్యులు ధనపాల్ సూర్యనారాయణ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జగదీష్ కులకర్ణి బిజెపి నాయకులు నాగోల్ల ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్ పంచ రెడ్డి శ్రీధర్ వినోద్ రెడ్డి, ఇల్లందుల ప్రభాకర్ శివ నూరి భాస్కర్ దాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:మండలంలోని తాళ్ల రామడుగు, కొండూరు, చీమనుపల్లి ,సిరికొండ గ్రామాలలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతా రాముని కల్యాణం నిర్వహించారు. భక్తులు తండోపతండలుగా తరలివచ్చారు. అనంతరం అన్న సత్రం నిర్వహించారు.

మెండోర : మండలంలోని పోచంపాడ్ గోదావరి నది తీరాన ఉన్న శ్రీ రాములవారి ఆలయానికి నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్టువస్త్రాలను, తలంబ్రాలను ప్రతి సంవత్సరం లాగానే ఈసారి పంపించారు. ఈ సందర్భంగా బినోల సొసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు , తలంబ్రాలు ఆలయ పూజారికి అందించారు. కవిత కుటుంబ సభ్యుల పేర్లపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భీంగల్ జాగృతి టౌన్ అధ్యక్షులు సతీష్ కుటుంబ సభ్యులు, ఆలయ చైర్మన్, సీఈవో ఉన్నారు.

మాక్లూర్:మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి ని ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెూమం, సీతారాముల కళ్యాణం నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మోపాల్ : కల్యాణ వేడుకల్లో పాల్గొన్న దిల్‌రాజు, వేణు ఎల్దండి



మెండోర : పట్టువస్త్రాలు అందజేస్తున్న బినోల సొసైటీ చైర్మన్ దంపతులు



డిచ్‌పల్లి : కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సీపీ నాగరాజు సేవలు అభినందనీయం

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాకు సిపిగా పనిచేసిన నాగరాజు సేవలు అభినందనీయమని పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు తులసి పట్వారి అన్నారు. ఈ నెలలో రిటైర్డ్ కాబోతున్న సిపి ఉత్తమ పోలీస్ అధికారిగా హెూంమంత్రి మమ్మద్ హలీ చేతుల మీదుగా సత్కరించబడడం అభినందనీయమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఇటీవల తాను కలిసి ఆజాదిక అమృత్ మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా పుస్తకాన్ని అందజేసినట్లు తెలిపారు. సీపీగా పనిచేసిన నాగరాజు పోలీస్ శాఖలో అంచలంచెలిగా ఎదిగారని ఎస్ఐగా 1989లో విధుల్లో చేరి సీఐగా వరంగల్లో సుదీర్ఘకాలం పని చేశారని, ప్రతిభా పనితీరు కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి గా ఇతర హెూదాల్లో నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో పలు ఎన్కౌంటర్లలో పాల్గొని, కమిషనరేట్‌లో సిపిగా ఆయన చేసిన సేవలు ఎంతో అభినందనీయమని తెలిపారు..

విగ్రహ ప్రతిష్ఠాపనలో బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



పూజల్లో పాల్గొన్న బాజిరెడ్డి జగన్

ఇందల్ వాయి మం డలంలోని చంద్రాయాన్ పల్లి గ్రామంలో శ్రీ సీతారాముల లక్ష్మణ శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ పున:ప్రతిష్టాపన కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధర్పల్లి జడ్పీటిసి బాజిరెడ్డి జగన్మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఇందల్వాయి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, సర్పంచ్ లలిత గంగాదస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఎంపిటిసి మారంపల్లి సుధాకర్, సహకార సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నీరడి నరేష్, సీనియర్ నాయకులు పాశం కుమార్, అరటి రఘు,పాశం పెద్ద నర్సింలు, లోకాని గంగారాం, ఎన్ డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి ఆనంద్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులకు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసా కొత్తూర్ గ్రామ సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ దంపతులను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల గ్రామానికి 9 థీమ్స్‌లకు గాను జిల్లాస్థాయిలో సుపరిపాలన విభాగంలో జాతీయ పంచాయతీరాజ్ అవార్డును, మండలంలో 6 అవార్డులను అందుకున్నందుకు సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, ఉప సర్పంచ్ రాజేశ్వర్‌ను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ సర్పంచ్ పద్మ రాజేశ్వర్ నాలుగు సంవత్సరాల నుండి చేసిన పరిపాలన, అభివృద్ధి పనులను, శానిటేషన్ పనులను అన్నింటిని గుర్తించి అవార్డును గ్రామానికి అందించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లౌడియ వసంత్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఏనుగు గంగారాం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి భారీ బందోబస్తు ఏర్పాటు

- ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ఏసీపీలు, సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

శ్రీరామనవమి సందర్భంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కమిషనరేట్ పరిధిలో ఉన్నటువంటి దేవాలయాల వద్ద భారీ బందోబస్తును నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు గురువారం ఏర్పాటు చేశారు. అదనపు పోలీస్ కమీషనర్ (ఎ.ఆర్) గిరిరాజు, అదనపు పోలీస్ కమీషనర్ (హెూమ్ గార్డ్సు) శ్రీనివాస్, పరిపాలన అధికారి జి.మధుసుధర్ రావు, నిజామాబాద్, ట్రాఫిక్, ఎ.ఆర్ ఎసిపిలు, సూపరింటెండెంట్లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్, ఆర్.ఎస్.ఐ లు, పిఇటిలు, ఆయాపోలీస్‌స్టేషన్ల సిబ్బంది, క్యూఆర్టీ సిబ్బంది, ఐడి పార్టీ సిబ్బంది, జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తులను నిర్వహించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు సైతం తమ విధులను నిర్వహించారు. పండగ సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్ కమిషనర్ నాగరాజు పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో శ్రీరామనవమి వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని రామాలయంలో నిర్వహించిన శ్రీ రామనవమికి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆలయ నిర్మాణానికి 50వేల రూపాయలతో పాటు బంగారు పడగలు, గుండ్లహారం, తలంబ్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్ పంతులు, ఆలయ కమిటీ చైర్మన్ కరిపె మల్లేష్, చందు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాల తలంబ్రాలు అందజేసిన పట్టణ సర్వ సమాజ్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రఖ్యాతిగాంచిన నవనాథ సిద్దుల గుట్టపై నిర్వహించిన సీతారాముల కల్యాణానికి సర్వ సమాజ్ తరపున కొంత నగదును ముత్యాల తలంబ్రాలను గురువారం అందజేశారు. మాణిక్ ప్రభు మందిర నుంచి సర్వ సమాజ్ అధ్యక్షులు ఆకుల రాజు ఆధ్వర్యంలో సర్వ సమాజ్ సభ్యులు, పెద్దమనుషులు ర్యాలీగా వెళ్లి ముత్యాల తలంబ్రాలను సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న పండితులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు

టీఎస్ ఆర్టీసీ డిపోలో వాటర్ కూలర్ ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్. మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ సూచనల మేరకు ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం చల్లని తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. అందులో భాగంగా గురువారం బస్‌స్టాండ్‌లో డిపో మేనేజర్ కె. కవిత ఆధ్వర్యంలో వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. ప్రయాణికులందరికీ చల్లని తాగునీటిని అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంస్థ ప్రజలకు మరిన్ని సేవలను అందిస్తుందని, ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని, అంతేకాకుండా ప్రైవేటు వాహనాలకు దూరంగా ఉండాలని సురక్షితమైన, సుఖప్రదమైన ఆర్టీసీ బస్సులోని ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎఫ్ గంగా కిషన్, పిడబ్ల్యుసి మెంబర్ నాగేశ్వరరావు, సేఫ్టీ వార్డెన్ ఎస్‌వివి. రెడ్డి, డివిఎస్ చక్రవర్తి, ఆర్టీసీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో నాలుగేండ్ల చిన్నారి మృతి

- పండుగ పూట విషాదం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



చిన్నారి మృతదేహం

పండగ పూట గ్రామంలో, కుటుంబంలో నాగుపాము విషాదం నింపింది.నాలుగేళ చిన్నారికి నాగుపాము కాటు వేయడంతో మృతి చెందింది. ఈ సంఘటన ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి కలికోట గంగాధర్ కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి ముందు కూతురు నాలుగేళ్ల చిన్నారి అమూల్య ఆడుకుంటూ ఉండగా నాగు పాము కాటు వేసింది . అమూల్య కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు గుమిగూడి కాటు వేసిన నాగు పామును చంపి వేశారు. చికిత్స నిమిత్తం చిన్నారిని నిజామాబాద్ జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో డిచ్ పల్లి మండలంలోని దర్మారంబీ గ్రామం వద్ద తుదిశ్వాస విడిచింది. గురువారం శ్రీరామనవమి పండగ కు ఏర్పాట్లు చేస్తున్న సందర్భంలో పాము కాటుకు చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో, కుటుంబం లో విషాద ఛాయలుఅలుముకున్నాయి.

శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న పారిశ్రామికవేత్త పైడి రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



పూజల్లో పాల్గొన్న రాకేష్‌రెడ్డి దంపతులు

పట్ట ణంలోని పెరికిటు హనుమాన్ ఆలయంలో గురువారం జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో అంకాపూర్ స్వగ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. జానకి రాముల కళ్యాణ ఘట్టాన్ని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆపదలో కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకునేందుకు రాకేష్ రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని, చలివేంద్రాలను ఏర్పాటు చేసి అందరి కష్టాలను తన కష్టంగా భావిస్తూ రాజకీయాల్లోకి రావడం ఎంతో సంతోషకరమని స్థానికులు అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామములోని బుధవారం రాత్రి రెండు 25 కిలో వాట్స్ ట్రాన్స్‌ఫార్మర్లను లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగలించిన ట్రాన్స్‌ఫార్మర్లను ఏడిఈ శ్రీధర్, ఏఈ మనీషా, లైన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు పరిశీలించారు.

సామాజిక సేవలో విద్యార్థులు ముందుండాలి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్

నవతెలంగాణ-భీంగల్



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సరంచ్ సంజీవ్

సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఎల్లప్పుడు ముందుండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సతీష్ అన్నారు. మండలంలోని బడా భీంగల్ గ్రామంలో డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చేట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్పంచ్ ఎర్రోళ్ల సంజీవ్ ప్రశంసపత్రాలను అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతు విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సేవ చేయడం అలవర్చుకొని దీని ద్వారా దేశ సేవకోసం చేసేందుకు ముదుండాలన్నారు. సర్పంచ్ సామాజిక అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలొరెడ్డి, వైస్ ఎంపిపి బావాయి, విడిసి అధ్యక్షుడు కిషన్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మోహన్, లెక్చరర్లు అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్,, శిబిరం కో ఆర్డినేటర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

8 గ్రామాల్లో ఐమాస్ట్ లైట్లు ప్రారంభం

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్



ఐమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న నాయకులు

మండలంలోని 8 గ్రామాలలో 10 హైమాస్ట్ లైట్లు ఏకకాలంలో ప్రారంభించినట్లు జడ్పీటిసి అల్లకొండ భారతి రాకేష్ చంద్ర గురువారం తెలిపారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్థానిక సంస్థల నిధులతో, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో రూ10లక్షలు, జడ్పీటీసీ నిధులను 2.40 లక్షలతో వేల్పూర్ మండలలో 8 గ్రామాలకు 10 హైమ్యాస్ట్ లైట్లు పారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమా జమున, సర్పంచ్ రాధా మోహన్ జడ్పీటీసీ సభ్యురాలు అల్లకొండ బారతీ రాకేష్ చంద్ర , మండల బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జైడి నాగధర్‌రెడ్డి, కార్యదర్శి రేగుల రాములు మార్కెట్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సామ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ గంగారెడ్డి, సొసైటి అధ్యక్షులు లింబారెడ్డి, రామలయ కమిటీ చైర్మన్ గూడల గంగాధర్, సొసైటి ఉపాధ్యక్షులు గూడల రమేశ్ ఎంపీటీసీ గంగారెడ్డి, సొసైటి డైరెక్టర్ గంగాధర్, ఉపాధ్యక్షులు ఎంగంటి రవి, పూనమ్‌రెడ్డి, మాల, మాదిగ కుల సంఘాల పెద్దలు అంకనగారి రాజేశ్వర్, కుమ్మె రాజేందర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ పెడితే ప్రవీణ్‌కు బాధెందుకు..?

- యెండల లక్ష్మి నారాయణ

నవతెలంగాణ-నవీపేట్



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

ఉగాది పర్వదినం సందర్భంగా రామాలయం ఎదుట ఫ్లెక్సీ పెడితే సర్పంచ్ భర్త ప్రవీణ్‌కు నొప్పి ఎందుకని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. మండలంలోని లక్ష్మీ కిసాన్ ఫారంలో రాంపూర్ సర్పంచ్ భర్త దొంత ప్రవీణ్ కుమార్ బాధితులైన రామకృష్ణ, గౌతమ్ కుటుంబాన్ని ఆయన గురువారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉగాది రోజు రామకృష్ణ, గౌతమ్ తమ షాపు పేరుతో రామాలయం ఎదుట ఫ్లెక్సీ పెడితే దురుద్దేశంతో దుర్భాషలాడి కాలితో తన్ని తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరంతా దొంత ప్రవీణ్ క్రైస్తవుడని కోడై కోస్తుంటే అధికారులు, పోలీసులు మాత్రం అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గడం సరికాదని అన్నారు. అధికారులు ఎస్సీ ధ్రువీకరణపై వెంటనే ఎంక్వైరీ కమిటీ వేసి నిర్ధారణ చేయాలని లేనియెడల రెవెన్యూ అధికారులు సైతం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని అన్నారు.

ఎస్సీ కోటాను కొల్లగొడుతున్నాడు

కన్వర్టెడ్ క్రిస్టియన్ అయిన దొంత ప్రవీణ్ ఎస్సీ రిజర్వేషన్ అనుభవిస్తూ ఎస్సీల కోటాను కొల్లగొడుతున్నాడని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్ అన్నారు. గతంలో యంత్ర లక్ష్మిలో ట్రాక్టర్ తో పాటు, దళిత బంధు పథకాన్ని పొందడమే కాక ప్రభుత్వ భూములను అక్రమ మార్గంలో పొంది రైతుబంధును దర్జాగా అనుభవిస్తూ ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని కాబట్టి వెంటనే అతని ఎస్సీ సర్టిఫికెట్ రద్దుతో పాటు దౌర్జన్యాల డొంక కదిలించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బందెల ఆనంద్, రామకృష్ణ, వంశీ మోహన్, పుట్ట శ్రీనివాస్ గౌడ్, పిల్లి శ్రీకాంత్, గణేష్, రాము, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకుపై శ్రీరాముడి చిత్రపటం

నవతెలంగాణ-మద్నూర్

శ్రీరామ నవమి సందర్భంగా బాస బాలు అనే యువకుడు ఆకుతో శ్రీరాముని చిత్రపటాన్ని తయారుచేసి అందరిని ఆకర్షింపచేశాడు. బాలు ఆర్ట్ ఉపాధ్యాయునిగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఆకర్షణీయంగా ఆకుతో శ్రీరాముని చిత్రపటం తయారు చేశారు. ఈ చిత్రపటాన్ని చూసి ప్రతి ఒక్కరూ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.



ఆకుపై శ్రీరాముడి చిత్రపటం

చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని శ్రీరామ మందిరం వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ జుక్కల్ శాఖ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు ప్రారంభించినట్టు రెడ్‌క్రాస్ మండల చైర్మెన్ ఉమాకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీటీసీ లక్ష్మీబాయి, రెడ్‌క్రాస్ సభ్యులు నరేష్, సంతోష్, హన్మంత్, గోరఖ్ నాథ్, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం



విరాళం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ అభివృద్ధికి తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన వసంత-నరేందర్ రెడ్డి, ఆధ్య-అర్జున్ రామ్ ఆలయ అభివృద్ధికి రూ.15,003 విరాళాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అంద మహేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన భక్తులకు శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు, ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడకండ్ల రామగిరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

అల్మాజిపూర్‌లో పోషక మహోత్సవాలు



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని అల్మాజిపూర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో పోషక మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు పాలు, గుడ్లు, కూరగాయలు తినాలని సూచించారు. పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ లత, అంగన్వాడీ టీచర్ మంగ, గర్భిణులు పాల్గొన్నారు.

చిట్యాలలో సీసీ రోడ్డు, డ్రయినేజీ పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని చిట్యాల గ్రామంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు గ్రామంలో రూ.ఐదు లక్షల నిధులతో సీసీ రోడ్లు, రూ.ఐదు లక్షల నిధులతో డ్రైనేజీ పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవితా బాలయ్య, ఎంపీటీసీ రాజమణి రవీందర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్, తదితరులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఉషాగౌడ్, సర్పంచ్ మామిడి దామోదర్‌తో కలిసి గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ కృషితో మంజూరైన రూ.5 లక్షల నిధులతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు వివరించారు. గ్రామానికి బీసీ కమ్యూనిటీ హాల్ మంజూరు కావడం పట్ల సర్పంచ్, గ్రామ పెద్దలు స్థానిక ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిడి రవి, గ్రామ పెద్దలు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సర్పంచ్ గఫర్‌కు సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా కళ్యాణోత్సవ ర్యాలీని గ్రామస్తులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మైనార్టీ సర్పంచ్ షేక్ గఫర్ పాల్గొనగా ఆయనకు శ్రీరామ భక్తులు ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ షేక్ గఫర్ కులమతాలకతీతంగా అన్నీ ఉత్సవాలలో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు గానూ ఆయన్ను ఘనంగా సన్మానించారు.



మైనార్టీ సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కన్నులపండువగా.. సీతారాముల కల్యాణం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున అన్నదానాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

శ్రీ రామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రజలు ఉదయం నుంచే రామాలయాలకు తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించి.. కల్యాణాన్ని తిలకించారు. ఇక ఆలయాల వద్ద అన్నదానం చేపట్టారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని శభరిమాత ఆలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేయించుకున్నారు. అనంతరం సీతారాముల వారి కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సాగింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీతారాములు వారికి భక్తులు ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మద్నూర్, పెద్దతడుగూర్‌లో అన్నదానం

మద్నూర్ : శ్రీరామ నవమిని పురస్కరించుకొని మద్నూర్ మండలంలోని ప్రతి గ్రామంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో గల శ్రీరాముని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెద్ద తడగూర్ గ్రామంలో గల ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ రెండు గ్రామాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్నూర్ టు సలాబత్‌పూర్ వరకు బైక్ ర్యాలీ..

శ్రీరామ నవమి సందర్భంగా మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ శ్రీరామ ఆలయం నుంచి మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మద్నూరు మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ పాకలవార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంతో పాటు ధర్మారం, ఆయా గ్రామాలలో రామాలయాలలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో పూజ కార్యక్రమాలు, శ్రీ రామ జనన అనంతరం సీతరాముల కల్యాణ మహోత్సవం, ప్రధాన వీధుల గుండా పల్లకి ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ, వాహిని, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహం నుంచి రామ మందిర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండలి శ్రీనివాస్ కుటుంబం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీరామనవమి ఏర్పాట్లు పూర్తి..

మండల కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవం, శనివారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్టు రథ, కుస్తీ పోటీల కమిటీ సభ్యులు జొన్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, శశిధర్, బోడాల నవీన్, కొఠారి ప్రభాకర్, అంబదాస్, పోచయ్య, బాబాగౌడ్, గాండ్ల ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రథ, కుస్తీ పోటీలకు గానూ మండల కేంద్రంలోని కుస్తీ పైల్ వాన్‌లతో పాటు జుక్కల్, మహారాష్ట్రలోని దెగ్లూరు ప్రాంతాల నుంచి మల్లయోధులు రానున్న నేపథ్యంలో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వీక్షించాలని తెలిపారు. ఫైనల్ కుస్తీ రూ.5వేల వరకు ఉంటుందని తెలిపారు.

శ్రీరామనవమి సందర్భంగా పట్టు వస్త్రాలు పంపిన ఎమ్మెల్సీ కవిత..

బోధన్ : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల రామాలయానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్టువస్త్రాలు, తలంబ్రాలు, రూ.50వేల నగదు పంపించారు. వీటిని బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, శివాలయం చైర్మన్ బీర్యార్ బుజ్జి, నాయకులు లోకం శ్రీనివాస్, ఎంపీటీసీ శివ, నాయకులు స్వామి, ప్రవీణ్ జాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పెంటఖుర్దు క్యాంప్, సాలంపాడ్ క్యాంప్, నాగనపల్లి, భవానీపేట్ గ్రామాలలో శ్రీరామనవమి సందర్భంగా రాములోరి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. బోధన్ పట్టణంలోని సీతారామాలయంలో ఆయేషా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు శ్రీనివాసరావు, అంజమ్మ, తూమురవి, పల్లంపాటి కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, శివాలయం చైర్మన్ బీర్యార్ బుజ్జి, బీఆర్ఎస్ నాయకులు మధు నాగన్ పల్లి, జేఏసీ శంకర్, హరి, ప్రవీణ్ జాదవ్, సాగర్, బోదు శంకర్ పాల్గొన్నారు.



బోధన్ : అంబలి పంపిణీ

సాలూర మండల కేంద్రంలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర..

శ్రీరామనవమిని పురస్కరించుకొని హనుమాన్ స్వాములు సాలూర మండలం కేంద్రంలో హనుమాన్ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చిత్రపటాన్ని రథంలో ఊరేగిస్తూ నృత్యాలు చేశారు. అనంతరం ఒంటి హనుమాన్ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

ఎడపల్లి : మండలంలో శ్రీ రామ నవమి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎడపల్లిలోని శ్రీరామమఠంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచారం గ్రామంలోని శ్రీ రామాలయంలో స్థానిక సర్పంచ్ ఇంద్రకరణ్, ఎంపీటీసీ పద్మ ముత్తన్న గ్రామ పెద్దల సమక్షంలో శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని ఏఆర్పీ క్యాంప్‌లో సర్పంచ్ గంగన్న గారి అలేఖ్య మహేష్ గౌడ్, ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎడపల్లిలో శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవం..

మండల కేంద్రంలోని శ్రీరామ మఠంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సీతారామ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు శ్రీ రామ పీఠాధిపతులు ఆత్మనామ సురేష్ మహారాజ్, జయరామ్ మహారాజ్ తెలిపారు.

పల్లకి సేవలో హనుమాన్ భక్తులు..

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో సీతరాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మండల కేంద్రంలో సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ తిరుమలరెడ్డి, పురోహితులు, హనుమాన్ సేవాసమితి స్వాములు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : మండల కేంద్రంలోని నగరేశ్వత ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు గజవాడ నాగరాజు సమక్షంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అలాగే ఇసన్నపల్లి, సిద్ధరామశ్వరనగర్, రామేశ్వరపల్లి అయా గ్రామాలలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని ఆయా గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామారెడ్డి మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి, మద్దికుంటలో పడిగె రాయి రాముల వారి దేవాలయంలో, రెడ్డిపెట్ పుట్టు లింగం దేవాలయంతో పాటు ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా వీధుల్లో స్వామివారి ఊరేగింపు, కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామారెడ్డిలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కళ్యాణోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, పాలకవర్గ సభ్యులు, ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సర్పంచ్ దండ బోయిన సంజీవ్, ఎంపీటీసీలు తుపాకుల రజిత రాజేందర్‌గౌడ్, భాగ్యలక్ష్మి శ్యామ్, ఉప సర్పంచ్ పోతునూరి ప్రసాద్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వర్ని : పోచారం సురేందర్‌రెడ్డి

దోమకొండ : మండల కేంద్రంలోని శివరామ మందిరంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఒడిబియ్యం స్వామివారి విశేష ఫల అభిషేకం జరిపి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజలి, జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, ఎంపీపీ శారదా, కార్యనిర్వాహణ అధికారి ఈవో ప్రభు, ఆలయ అధ్యక్షుడు అబ్రబోయిన రాజేందర్, ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామ కళ్యాణం మహోత్సవం రంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని నీలా క్యాంప్, వీరన్న గుట్ట, తాడి బిలోలి, రెంజల్, సాటాపూర్, గ్రామాలలో సీతారాముల కళ్యాణం ఉత్సవం జరగగా, కందకుర్తి గ్రామంలో అంగరంగ వైభవంగా సీతారాముల జయంతి ఉత్సవాలను జరిపారు. సీతారాముల విగ్రహాలను పల్లకిలో గ్రామాలలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు జరిపారు. మహిళలు పల్లకి ఊరేగిపిస్తున్న సమయంలో రోడ్లపై నీటినీ చల్లి మంగళ హారతితో స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వర్ని : మండల కేంద్రంలోని ఎస్ఎన్‌పురం గ్రామపంచాయతీ పరిధిలో శ్రీరామ మందిరంలో శ్రీరామ నవమి మహోత్సవంలో బాన్సువాడ ఇన్చార్జి పోచారం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కోటయ్య క్యాంప్ సాయిబాబా మందిరం వద్ద భక్తుల నిమిత్తం ఏర్పాటు చేసిన వంటశాల నిర్మాణానికి ఒక్క లక్ష యాభై వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆయన వెంట జడ్పీటీసీ హరిదాస్, మండలాధ్యక్షులు గిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు తదితరలున్నారు.

జాకోరాలో అన్నదాతకు సన్మానం..

మండలంలోని జాకోరా గ్రామంలో శ్రీరామ నవమి మహోత్సవాల సందర్భంగా గ్రామ ప్రజలకు అన్నదానం చేసిన అనిల్‌గౌడ్ కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు శాలువాతో ఘనంగా సన్మానించారు.



పెద్దకొడప్‌గల్‌లో..



రామారెడ్డిలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఎడపల్లిలో..

గాంధారి : మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలోని సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని గౌరారం, రామ లక్ష్మణ్‌పల్లి తదితర గ్రామాల్లో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న జడ కొప్పు కోలాటం..

సదాశివనగర్ : మండలంలోని ఉత్తునూరు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రాములోరి కళ్యాణం నిర్వహించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలోని కండేరాయా ఆలయ ఆవరణలో యువకులు జడకొప్పు కోలాటం వేశారు. ఆధునిక కంప్యూటర్ యుగంలో ఉన్న మనం పూర్వపు ఆటలు అంతరించిపోతున్న తరుణంలో ఉత్సాహంగా నేర్చుకొని జడ కొప్పు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. వారిని పలువురు అభినందించారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మద్నూర్

ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర, కర్ణాటక మూడు రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులో గల మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయాన్ని గురువారం జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో వచ్చే పూర్ణిమ రోజున జరిగే ఆంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకొని శ్రీరాముని జన్మదినం సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణంలో సప్త కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ నర్సింలుగౌడ్, కెలూరు ఎంపీటీసీ సభ్యులు విజయ్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్, ఆలయ గుమస్తా వేణు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ నాగర్తి భూమిరెడ్డి అధ్యక్షతన ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా సంవత్సర కాలంలో జరిగిన లావాదేవీలు, అప్పులు, జమ, ఖర్చులు వివరాలు, వరి ధాన్యం కొనుగోలు వచ్చిన కమిషన్ వివరాలు చర్చించారు.

సొసైటీ నుంచి తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని, వరి ధాన్యం కొనుగోలులో లారీలకు వరి ధాన్యాన్ని ఎక్కించుకునే విధంగా అందుబాటులో ఆరబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్ నాగర్తి పోతిరెడ్డి, ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ తక్కల నర్సారెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు బాపురెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, సీఈఓ శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మెన్ నాగర్తి భూమిరెడ్డి

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-తాడ్వాయి

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దూదేకుల జాకీర్ హుస్సేన్ (44) అనే వ్యక్తి వృత్తిరీత్యా దుబాయ్‌కి వెళ్లి అక్కడ పని చేసుకుని వచ్చి బతుకుతూ జీవిస్తూ ఉండేవాడు. అతనికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే గత కొన్ని నెలల క్రితం తన కూతురు వేరే అబ్బాయిని ప్రేమ వివాహం చేసుకొని వెళ్లిపోవడంతో మనస్థాపం చెందాడు. అలాగే రోజు తాగి వచ్చి భార్యత గొడవ పడుతూ ఉండేవాడు. బుధవారం రాత్రి సైతం తాగి వచ్చిన జాకీర్ హుస్సేన్ గొడవ పడి కొడుకును, భార్యను కొట్టడంతో వాళ్లు వేరే వాళ్ళ ఇంట్లో పడుకున్నారు. దీంతో అదే రాత్రి జాకీర్ హుస్సేన్ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య రఫియా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలకు రావాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వార్షికోత్సవ వేడుకలకు, పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం, బోనాల పండగకు ముఖ్య అతిథులుగా రావాలని దోమకొండ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మను, సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి షబ్బీర్ అలీని ముదిరాజ్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి బోయిని సత్యం, ఉప కార్యదర్శి నాగారపు రాజు, కోశాధికారి కమిండ్ల నర్సింలు, ముఖ్య సలహాదారులు కమిండ్ల కృష్ణ, మాజీ అధ్యక్షులు రాములు, డైరెక్టర్‌లు గరిగే సురేష్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా పూర్తయిన ఇంటర్ పరీక్షలు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మార్చి 15 నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు విజయవంతంగా పూర్తయినట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్తు, పోస్టల్, పాఠశాల విద్యాశాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని డిఐఇఓ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇంటర్ బోర్డు నియమ నిబంధనల మేరకు పరీక్షల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా ఇంటర్ విద్యాధి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలూరు జీపీ పాలకవర్గానికి సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

మండల స్థాయి జాతీయ పంచాయతీ అవార్డులు పొందిన ఆలూరు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సిబ్బందిని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వీడీసీ అధ్యక్షులు బార్ల గణపతి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో నిర్విరామ సేవలు చేస్తూ, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తీర్చుతూ అభివృద్ధిలో ముందు ఉండడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ దమ్మాజీ శ్రీనివాస్, సెక్రెటరీ రాజలింగం, కారోబార్ సంతోష్, వీడీసీ సభ్యులు కళ్లెం సాయి రెడ్డి, పోశెట్టి, కుమ్మరి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి
- పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్

రోడ్లపై చెత్త వేసేవారిపై కఠిన చర్యలు తప్పవని, పచ్చదనం, పరిశుభ్రతలో ఆర్మూర్ పట్టణాన్ని మొదటి స్థానంలో నిలబెట్టేలా మునిసిపల్ అధికారులు కృషి చేయాలని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి కోరారు. నమస్తేనవనాథపురం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయమే ఆయన శానిటేషన్ అధికారులతో కలిసి పట్టణంలోని పలువార్డుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. డివైడర్లపై రాళ్లు, చెత్త కాగితాలు ఉండటం చూసి అసహనం వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి తక్షణమే వాటిని తొలగించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. చెత్తను తొలగించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు ఎలా నడుస్తున్నాయని అడిగారు. పారిశుధ్య కార్మికులతో కలిసి ఆయన స్వయంగా చెత్త తొలగించారు. శానిటేషపై అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టాలని సూచించారు. తెల్లారేసరికి రోడ్లు తళతళ మెరవాలన్నారు రోడ్డుపై ప్లాస్టిక్ గ్లాసులు వేస్తున్న ఒక టీషాప్ యజమానిని మందలించి మరోసారి ఇలా రోడ్డుపై వేస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. "డ్రైనేజీలు ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలి. విధిగా ప్రతీ బుధవారం స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమాన్ని నిర్వహించాలి. పట్టణంలో ప్రతీ బుధవారం సాయంత్రం అంగడి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఉదయమే పట్టణాన్ని పరిశుభ్రం చేయాలి. మొత్తం 36 వార్డుల్లో పారిశుధ్య పనులు బాగా జరగాలి. నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టాలన్నారు. ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వం అందజేసిన తడి చెత్త, పొడి చెత్త డస్ట్ బిన్ లను వాడి పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. కరోనా వైరస్ మళ్లీ ప్రబలుతోందని వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ సూచనలను, సలహాలను ప్రతి ఒక్కరూ పాటించాలని జీవన్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

చిరుత కూనల కలకలం ?



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గంగరమంద గ్రామ శివారులోని పొలాల్లో చిరుత పిల్ల కనిపించింది. గురువారం ఉదయం రైతు పొలాలకు వెళ్లిన సమయంలో చిరుత పిల్ల గెట్టుపై వెళ తుండగా తన కెమెరాల్లో వీడియో తీశారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వీడియోను సోషల్ మీడియా ద్వారా గ్రామస్థులకు సమాచారం అందించడంతో గ్రామస్థులు, అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎంత వెతికినా చిరుత పిల్లలు కనిపించక పోవడంతో అడవి పిల్లి అయి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఇక్కడ కూడా చిరుత ఆనవాళ్లు కనిపించలేదని అన్నారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, గ్రామ కమిటీ సభ్యులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు సాహితి జాతీయ వేదిక పురస్కారానికి వేంపల్లి వాసి ఎంపిక



నవతెలంగాణ-ముప్కాల్

తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవాసంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ పురస్కారం ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన సాయిరాజ్ యాదవ్ కు దక్కింది. గత కొన్ని సంవత్సరాలుగా సాయిరాజ్ యాదవ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తెలుగు వెలుగు సాహితి జాతీయ వేదిక పురస్కారానికి ఎంపిక చేశారని అన్నారు. రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ, పేద విద్యార్థులకు దుస్తుల పంపిణీ, అనాథ పిల్లలకు నిత్యావసర సరుకుల పంపిణీ, హాస్టల్ విద్యార్థుల మౌలిక సదుపాయాల కోసం చేసిన కార్యక్రమాలను గుర్తించి అవార్డు దక్కిందన్నారు. కరోనా సమయంలో కూడా సొంత డబ్బులతో ఫుడ్ పాకెట్స్ పంపిణీ, ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన సదస్సు కల్పించడం, హరితహారంలో యువజన సంఘాలతో కలిసి మొక్కలు నాటడం, విద్యార్థుల స్కాలర్షిప్ ల కోసం చేసిన కార్యక్రమాలను గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక సేవాసంస్థ డాక్టర్ ఈసవేని మనోజ్ యాదవ్ సిఫార్సు మేరకు సాయిరాజ్ ను ఎంపిక చేశారు.

లాభాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- సొసైటీ చైర్మన్ కోమటి శెట్టి గంగాధర్



మాట్లాడుతున్న చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్

నవతెలంగాణ-ముప్కాల్

సహకార సంఘం అందించే లాభాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ కోమటి శెట్టి గంగాధర్ అన్నారు. రెంజర్ల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం సొసైటీ డైరెక్టర్లు, గ్రామ రైతుల మధ్య మహాజన సభ నిర్వహించారు. సొసైటీ చైర్మన్ కోమటి శెట్టి గంగాధర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సొసైటీలలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం నుంచి రైతులకు అందే లాభాలను పూర్తి స్థాయిలో వివరించారు. అదేవిధంగా 2022-23 సంఘ ఆర్థిక లావాదేవీలను సొసైటీ డైరెక్టర్లు, రైతుల మధ్య చదివి వినిపించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిరిధవర్ ముత్తెన్న, ప్రాథమిక సహకార సంఘం సెక్రటరీ కె.గంగాధర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి కల్యాణం

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని వివిధ గ్రామాల్లో రామాలయాల్లో సీరాముల కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. పిప్రి గ్రామంలోని లొద్ది రామన్న ఆలయాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి దర్శించుకున్నారు. మెండోరా గ్రామంలో విడీసీ అద్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణకేంద్రంలోని మోక్షనంద ఆశ్రమంలో సీతరాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. బాబాపూర్‌లో కూడ అన్నదానం చేపట్టారు.

బాధిత రైతును పరామర్శించిన సునీల్ కుమార్



పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన రైతు దుంపల శ్రీనివాస్‌ను గురువారం ఆరంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. రైతు శ్రీనివాస్ మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఒకరి వద్ద భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంట చేతికి వచ్చిన సమయంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు తెగి మొక్కజొన్న పంట పూర్తిగా కాలిపోవడమే కాకుండా డ్రిప్పు, ఇతర వ్యవసాయ పరికరాలు కాలిపోయాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ శ్రీనివాస్‌ను పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన వెంట బాల్కొండ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇంచార్జ్ రూయ్యడి రాజేశ్వర్, నవాతే రంజిత్ కుమార్, సునీల్ సేన సభ్యులు పాలెపు నరసయ్య, నల్ల గణేష్ గుప్తా, తదితరులు ఉన్నారు.

హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలి : బీఎల్‌పీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే భారత సమాజంలోని మెజారిటీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి ప్రాథమిక హక్కులకు రక్షణ ఉంటుందని బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరిగాద సిద్దిరాములు అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శివాజీ నగర్‌లోగల బిఎల్ టియు ఉత్తర తెలంగాణ ప్రాంతీయ కార్యాలయంలో బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కమిటిల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బహుజన లెఫ్ట్ పార్టీ 2018లో ఎన్నికల్లో రైతు నాగలి గుర్తుపై 107 స్థానాల్లో పోటీచేసి ప్రత్యామ్నాయ సైద్ధాంతిక శక్తిగా ప్రత్యేకతను చాటుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బహుజన, వామపక్ష పార్టీలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కన్వీనర్ కుమ్మరి నందు, నిజామాబాద్ జిల్లా కన్వీనర్ కె.మదు రాష్ట్ర కమిటి నాయకులు ముద్రకోల ఆంజనేయులు, వడ్ల సాయి కృష్ణ, బ్రాహ్మణపల్లి జగదీష్, స్వామి సయ్యద్, గంగా మణి, సమ్రీన్, శ్రీమాన్ లక్ష్మీ, మాల, గోదావరి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు పలువురు ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఖమ్మం జిల్లా బోనకల్లునందు నిర్వహించిన 67వ తెలంగాణ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర జట్టుకు సన్నదత శిబిరానికి ఎంపిక చేయడం జరిగిందని బాల్ బ్యాడ్మింటన్ సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ గురువారం తెలిపారు. వీరికి ఈనెల 26నుండి 30 వరకు హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్ మారుతి బాల్ బ్యాడ్మింటన్ గ్రౌండ్స్ లో శిక్షణ శిబిరం నిర్వహించి ఇందులో నుండి ప్రతిభ కలిగిన క్రీడాకారులను తెలంగాణ జట్టుకు ఎంపిక చేయడం జరిగింది. ఇందులో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు శశిధర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కామారెడ్డి, సాయి శివ గిరిరాజ్ కాలేజ్ నిజామాబాద్, యు. శివాని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మోర్తాడ్, దీపిక గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ మోర్తాడ్ క్రీడాకారులు తెలంగాణ జట్టుకు ఎంపిక కావడం జరిగింది. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 31 నుండి 04 వరకు మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో జరిగే 67వ జాతీయస్థాయి జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడా పోటీలకు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపిక కావటం పట్ల జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్,వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వి హనుమంత్ రెడ్డి,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్ ఉపాధ్యక్షులు కిషన్, కిషోర్,రంజిత్,రాజ్ కుమార్ కోశాధికారి రాజేశ్వర్, కృష్ణమూర్తి సంఘ సభ్యులు సురేందర్, నాగేష్ వినోద్, సంజీవ్ సురేష్, శ్రుపాన్, సాయిబాబా, మాధురి, భాగ్యశ్రీ, స్వప్న, భాగ్య అభినందించారు.



శివాణి



శశిధర్



సాయిశివ

ఫుట్ ఓవర్, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి రైల్వే స్టేషన్ (ఘన్ పూర్) రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గురువారం ఘన్‌పూర్ గ్రామస్తులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కు కలిసి వత్రాన్ని అందజేశారు. ముందుగా బాజిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరెంట్ రైళ్లు ప్రారంభమైనందున డిచ్ పల్లి స్టేషన్ కు రాక పోకలు సాగించే టప్పుడు, ఇతర గ్రామలు, పట్టణాల్లో ఉన్న మండల కేంద్రంలో ఉన్న కార్యాలయాలన్ని ఘన్ పూర్ లోనే ఉండటంతో వచ్చే పోయే సందర్భంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చుట్టు పక్కల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ రైల్వే స్టేషన్ వద్దఎప్పుడు ఏదో ఒక గూడ్స్ రైలు పట్టాలపై ఉంటుందని దాని కింది నుండి మహిళలు, వృద్దులు వచ్చి పోయే టప్పుడు పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వారు వివరించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి,అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం కోసం తనవంతు కృషి, సహకారం అందజేస్తామని, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, విడిసి సభ్యులు, పెద్దపులి భూమయ్య, మొచ్చ మహేష్, చిన్న దేవయ్య, చిన్న గంగారాం, సాయిలు, రాజు, ముత్యం, కిషన్, గంగారాం, కుర్రి రామకృష్ణ, డైరెక్టర్ సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ రంజిత్, గడ్డం గంగాధర్, యేన్నొల్ల రాజు, కర్దురం రవికిరణ్, గంగి సాయిలు, రాజేశ్వం పాల్గొన్నారు.

సీపీ నాగరాజును సత్కరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్



సీపీని సన్మానిస్తున్న పీపీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి. లక్ష్మీ నర్సయ్య, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆధ్వర్యంలో పదవి విరమణ పొందుతున్న సీపీ నాగరాజు ని నూతనంగా ఏర్పాటు చేసిన కమిషనరేట్ హాల్‌లో ఘనంగా గురువారం సత్కరించారు. ఈ సమావేశంలో పి.లక్ష్మీనర్సయ్య, డిప్యూటి డైరెక్టర్ కేసులకు సంబంధించిన విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తమ బాధ్యతలను సత్వరంగా నిర్వహిస్తున్నారని, న్యాయ సలహాలు తీసుకొని ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని తెలిపారు. అనంతరం సీపీ నాగరాజు మాట్లాడుతూ.. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులు ఒకే డిపార్టమెంట్‌కు చెందినవారమని, పోలీస్ అధికారులు న్యాయవ్యవస్థకు చెందిన ప్రతి న్యాయవాదికి (పబ్లిక్ ప్రాసిక్యూటర్స్) గౌరవం ఇవ్వాలని తెలిపారు. శిక్షలు పడుతున్నాయంటే దానికి ముఖ్య కారకులు పబ్లిక్ ప్రాసిక్యుటర్లు మాత్రమే అని, వారి న్యాయ సలహాలు ఎఫ్ఐఆర్ స్టేజి నుండి చార్జి షీట్ వరకు తప్పకుండా తీసుకొని కోర్టులో దాఖలు చేయాలని, అప్పుడే శిక్షపడే ఆస్కారం ఉంటుందని తెలిపారు. సన్మాన సభలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పి. రవిరాజ్, కవితరెడ్డి, డాక్టర్ సమ్మయ్య, శ్రీ ఆవారి రమేష్ లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రహీంమొద్దిన్, రాజేష్ గౌడ్, శ్రీమతి చిదిరాల రాణి, ఎం.కె. నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిబాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉప్లూర్ విద్యార్థిని



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాలికల పోటీలకు మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన గడ్డం దీపిక ఎంపికయ్యింది. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిమల్ల దేవన్న తెలిపారు. మహారాష్ట్రలోని ఆకోలాలో ఈనెల ఒకటవ తేదీ నుండి 4వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాలికల విభాగంలో దీపిక పాల్గొంటున్నట్లు తెలిపారు. జనవరి నెలలో ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దీపిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జాతీయస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ కోట్లకు ఎంపికైన విద్యార్థిని దీపికను సర్పంచ్ బద్దం పద్మా చిన్నారెడ్డి, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు మాధురి, స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.